పర్యవేక్షణ అంతంతే...!

- హోటళ్లు, రెస్టారెంట్లపై తనిఖీలేవీ?
- జిల్లాలో కల్తీ ఆహారంపై కొరవడుతున్న నియంత్రణ
- ఫుడ్ ఇన్స్పెక్టర్ లేరు.. సిబ్బంది అసలే లేరు..

మెదక్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఉరుకులు, పరుగుల జీవనంతో అత్యధిక శాతం జనాభా ఇంటి భోజనం కంటే హోటళ్లను ఆశ్రయించాల్సిన పరిస్థితులే ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. మెదక్ జిల్లాలో చాలా వరకు హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీ నిర్వాహకులు నాణ్యత లేని, నిల్వ ఉంచి భోజనాలు, ఆహార పదార్థాలు విక్రయిస్తూ ప్రజల అనారోగ్యానికి కారకులవుతున్నారు. దీంతో దవాఖానల పాలవుతున్నా ఫుడ్ సెఫ్టీ అధికారులు మాత్రం చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తున్నది.

కొరవడిన తనిఖీలు

జిల్లాలో ఆహార తనిఖీలు లేవని, అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలున్నాయి. నిత్యం తనిఖీలతో ఆహార నాణ్యతను పరీక్షించాల్సిన అధికారులు ఆ పని తమది కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వినియోగదారులు ఎవరైనా ఫిర్యాదు చేస్తేనో తప్ప అధికారులు కాలు కదపడం లేదు. ఫిర్యాదులు అందిన వెంటనే తనిఖీ చేయాల్సి ఉన్నా మరుసటి రోజో, లేక తీరిగ్గా వెళ్తుండడంతో రెస్టారెంట్ల నిర్వాహకులకే మేలు చేస్తున్నట్టు అవుతున్నదని ప్రజలు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు ఉన్నాయి. వీటిని నిరంతరం తనిఖీ చేయాల్సి ఉన్నా అధికారులు, సిబ్బంది కొరతతో ఆ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదు. జిల్లాలో అసలు ఫుడ్ సెఫ్టీ అధికారి ఉన్నారా లేరా అన్న సందేహం కలుగుతోంది. ఫలితంగా పలు హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు నిల్వ చేసిన మాంసం, పాడైన ఆహారం, బుజుపట్టిన ఐస్‌క్రీమ్‌లు విక్రయిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఆహారంలో కల్తీ జరగకుండా ఫుడ్ ఇన్స్పెక్టర్‌తో పాటు మున్సిపల్ అధికారులు సైతం పర్యవేక్షించాలి. కానీ జిల్లాలో మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట మున్సిపాలిటీల్లో అధికారులు హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. హోటళ్లు అపరిశుభ్రంగా ఉన్నాయనే అంశంపై ఫిర్యాదులు వచ్చినా తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

జిల్లాలో సిబ్బంది కొరత

మెదక్ జిల్లాలో ఫుడ్ ఇన్స్పెక్టర్‌తో పాటు సిబ్బంది కొరత వేధిస్తోంది. ఆహార నాణ్యతను పరీక్షించి కల్తీని అరికట్టాల్సిన ఈ శాఖలో మెదక్ జిల్లాలో ఒక్క అధికారి కూడా లేకపోవడం గమనార్హం. మెదక్ జిల్లాకు ఫుడ్ ఇన్స్పెక్టర్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్, అటెండర్లు ఉండాలి. హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న ఫుడ్ ఇన్స్పెక్టర్ మెదక్ జిల్లాకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో జిల్లాలో తనిఖీలు ఎప్పుడో ఒకసారి తనిఖీ జరుగుతున్నది.

తనిఖీలు చేస్తున్నాం

మెదక్ జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో అధికారులు, సిబ్బంది కొరత ఉంది. హైదరాబాద్‌తో పాటు మెదక్ జిల్లాలోనూ నేనే తనిఖీలు చేసి శాంపిళ్లు సేకరిస్తున్నా. సిబ్బంది కొరతతో తనిఖీలు చేయడంలో కొంత జాప్యం జరుగుతున్నది. కానీ అప్పుడప్పుడు తనిఖీలు చేస్తున్నాం.

- శ్రీశైక, ఇన్‌చార్జి, ఫుడ్ ఇన్స్పెక్టర్ మెదక్ జిల్లా

పట్టణంలోని ఓ హోటల్‌లో అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం

ఓ టీ దుకాణంలో ...

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

శివ్వంపేట, డిసెంబర్ 2: ఇంటి అప్పు తీర్చలేక వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతులబొగుడ గ్రామానికి చెందిన మంద నాగులు (32) ఏడాది క్రితం అప్పుచేసి నూతనంగా ఇంటిని నిర్మించుకున్నాడు. వాటిని తీర్చలేక ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది అతని పొలానికి దగ్గరలో ఉన్న అడవిలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మంద పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

అధిక కేసులు పరిష్కరించాలి

మెదక్ అర్బన్, డిసెంబర్ 2: ఈ నెల 14 నిర్వహించే లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కరించాలని జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్ అన్నారు. సోమవారం జిల్లా న్యాయస్థానముల సముదాయంలో బ్యాంకు, ఫైనాన్స్, చిట్‌ఫండ్ కౌన్సిల్స్‌తో సమావేశం నిర్వహించారు. కక్షిదారులు వినియోగించుకుని ఎక్కువగా కేసులు రాజీ కుదుర్చుకోవాలని కోరారు.

కిస్తీలు కట్టలేక ఆటో డ్రైవర్ ఆత్మహత్య

సంజీవ్ (ఫైల్)

శివ్వంపేట, డిసెంబర్ 2: జీవనోపాధి కోసం తీసుకున్న ఆటో నెలకిస్తీలు కట్టలేక ఆటోడ్రైవర్ బలవన్మరణానికి పాల్పడిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేటకు చెందిన పెద్దకోళ్ల సంజీవ్ (32) గత 8 నెలల క్రితం ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో ఆటో తీసుకున్నాడు. అది నడుపుతూ జీవిస్తున్నాడు. ఆటో కిరాయిలు అంతంత మాత్రంగానే రావడంతో ఆటో ఫైనాన్స్ కిస్తీలు కట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఏం చేయాలో తెలియక ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురై ఆదివారం రాత్రి పెద్దకోళ్ల నవీన్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఏడాది క్రితమే వివాహమైంది. మృతుడి భార్య శ్రీకన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

యువతి అదృశ్యం

శివ్వంపేట, డిసెంబర్ 2: యువతి అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన మదిర దేవయ్య కూతురు నీలిమ (19) తూప్రాన్‌లో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నది. గత నెల 29న కాలేజీకి వెళ్లి తిరిగిరాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దేవయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

200 మందికి వైద్య పరీక్షలు

కొల్చారం, డిసెంబర్ 2: మండలంలోని పరిగుంతం గ్రామంలో సంఘ సేవకుడు గట్టు ప్రశాంత్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి దవాఖాన వైద్య బృందంతో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 200 మంది రోగులను పరిశీలించి వారికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీజ, డాక్టర్లు పాల్గొన్నారు.

ఆన్‌జాబ్ శిక్షణను అలవర్చుకోవాలి

రామాయంపేట, డిసెంబర్ 2: విద్యార్థులు చదువుతో పాటు ఒకేషనల్ కోర్సులో ఆన్‌జాబ్ శిక్షణను అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి అన్నారు. సోమవారం రామాయంపేటలోని కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు ఎలక్ట్రికల్, వైండింగ్‌లో శిక్షణ అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలప్రకాశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రేపు సంగారెడ్డికి ఏకసభ్య కమిషన్ రాక

మెదక్, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ) : ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 4న ఏక సభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ బహిరంగ విచారణ కోసం సంగారెడ్డికి విచ్చేస్తున్నారని అదనపు కలెక్టర్ నగేశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట ఎస్సీ కులాల నాయకులు, పెద్ద సంఖ్యలో విచారణకు రావాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, IRFANA BEGUM, W/o. Mohammad Miskeen, R/o. H.No. 10-1-166/6, Nasarpura, Siddipet Dist., T.S. My Name wrongly mentioned as MAHMOODA BEGUM (entered in My Husband Passport) have Changed My Name as IRFANA BEGUM.
NT-Tirupathi

★I, MOHAMMAD MISKEEN, S/o. Mohammad Yaseen, R/o. H.No. 10-1-166/6, Nasarpura, Siddipet Dist., T.S. My Daughter Name wrongly mentioned as AFSHA TASLEEM in My Daughter's Passport, have Changed as AFSHA TASNEEM.
NT-Tirupathi

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బస్సు ఢీకొని విద్యార్థినులకు తీవ్రగాయాలు

- మెదక్, బొడ్మట్‌పల్లి రోడ్‌పై వర్షంలోనే విద్యార్థుల ఆందోళన

ప్రమాదంలో గాయపడిన విద్యార్థినులు

మెదక్ -బొడ్మట్‌పల్లి రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

పాపన్నపేట, డిసెంబర్ 2: ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు కాలేజీ విద్యార్థినులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన పాపన్నపేట మండలం నార్సింగ్ వద్ద సోమవారం జరిగింది. విషయం తెలిసిన కాలేజీ విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు మెదక్, బొడ్మట్‌పల్లి రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. వర్షం పడుతున్నా కదలకుండా గంటపాటు ఆందోళన చేశారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నార్సింగ్ గ్రామానికి చెందిన అఖిల, విజయ పాపన్నపేట జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కాలేజీకి వచ్చేందుకు నార్సింగ్ బస్ స్టాప్ వద్ద తోటి విద్యార్థులతో కలిసి నిల్చున్నారు. అదే సమయంలో బోడ్మట్‌పల్లి నుంచి మెదక్ వైపు వెళ్తున్న మెదక్ డిపో ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొట్టింది. అఖిల కాలుపై నుంచి టైరు వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జయ్యింది. విజయకు స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు కాల్ చేసి మెదక్ దవాఖానకు తరలించారు. అఖిల పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ దవాఖానకు తరలించారు. పాపన్నపేట ఏఎస్సై సంగన్న కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాలేజీ విద్యార్థుల ధర్నా

ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్య తీసుకోవాలని కాలేజీ విద్యార్థినులు ధర్నా చేశారు. కాలేజీ, పాఠశాల సమయంలో బస్సుల సంఖ్య పెంచాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు పాపన్నపేటలో రాస్తారోకో నిర్వహించారు. ధర్నాలో పాపన్నపేట, టేక్మాల్ ఏబీవీపీ కన్వీనర్లు ప్రవీణ్, మురళి పాల్గొన్నారు.

గురుకులంలో క్రీడా పోటీలు

ఖోఖో ఆటలు ఆడుతున్న విద్యార్థినులు

రామాయంపేట, డిసెంబర్ 2: రామాయంపేటలోని గురుకుల పాఠశాల, కళాశాల బాలికలకు కబడ్డీ, ఖోఖో క్రీడలను ప్రిన్సిపాల్ సంధ్యారాణి సోమవారం ఆడించారు. ప్రతిభ చాటిన బాలికలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆటలతో బాలికలు ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో టీచర్లు విజయకుమారి, లత ఉన్నారు.

కబడ్డీ ఆటలు ఆడుతున్న గురుకుల బాలికలు

రామాయంపేటలో భారీ వర్షం

పట్టణంలో కురుస్తున్న వర్షం

రామాయంపేట, డిసెంబర్ 2: రామాయంపేటలో సోమవారం భారీగా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండగా ఉండి అప్పటికప్పుడు ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ఎక్కడి వాహనాలు అక్కడే రెండు గంటల పాటు నిలిచిపోయాయి. రద్దీగా ఉండే మహంకాళి మార్కెట్ బోసిపోయింది. వర్షంతో జాతీయ రహదారిపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.

రామాయంపేటలో కురుస్తున్న భారీ వర్షం

స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో దామోదర్

చిన్నశంకరంపేట, డిసెంబర్ 2: ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో దామోదర్ తెలిపారు. సోమవారం మండలంలోని చందంపేట, రుద్రారం గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. కేంద్రాల వివరాల నమోదు అనంతరం జిల్లా అధికారులకు నివేదిక పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీవో గిరిజారాణి ఉన్నారు.

ఆ టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

- ఉపాధ్యాయులనూ దూషిస్తున్న టీచర్ సంపత్
- మహిళా టీచర్లు, ప్రిన్సిపాల్ కలిసి ఎంఈవోకు ఫిర్యాదు

విద్యార్థి అక్షిత్‌ను చూపిస్తున్న తండ్రి నర్సింహులు, ఫిర్యాదు చేస్తున్న టీచర్

సంపత్ సార్ తమను తిడుతాడని చెపుతున్న బాలికలు

కొల్చారం, డిసెంబర్ 2: కొల్చారంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న టీచర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు సహచర ఉపాధ్యాయులు ఎంఈవోకు సోమవారం ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులు, టీచర్లు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలో సంపత్ ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మేదరి నర్సింహులు కుమారుడు అక్షిత్ కుమార్‌ను చితకబాదాడు. రెండు చెవులు పట్టి పైకి లేపి కింద పడవేయడంతో విద్యార్థి భయపడి టాయిలెట్ చేసుకున్నాడు. అక్షిత్‌ను విచక్షణారహితంగా కొట్టడంతో మరో ఇద్దరు విద్యార్థులు సైతం భయంతో తరగతి గదిలోనే టాయిలెట్ పోసుకున్నారు. విషయం తెలుసుకున్న బాధిత విద్యార్థి తండ్రి నర్సింహులు పాఠశాలకు వెళ్లి చూడగా సదరు టీచర్ ఎవరికీ చెప్పకుండా పాఠశాల నుంచి వెళ్లిపోయాడు. టీచర్లు భవానీ, అరుణ మాట్లాడుతూ ఎందుకు కొట్టావని ప్రశ్నించగా తమను కూడా బూతుమాటలు తిట్టాడని తెలిపారు. తరుచూ విద్యార్థులను ఇష్టారీతిన కొడుతూ, నోటికి వచ్చిన బూతులు తిడతాడని, తోటి ఉపాధ్యాయులను కూడా దుర్భాషలాడుతాడని తెలిపారు. బాధిత విద్యార్థి తండ్రి నర్సింహులు మాట్లాడుతూ తన కుమారునికి గతంలో గుండె ఆపరేషన్ అయ్యిందని, ఉపాధ్యాయులు ఇష్టారీతిన కొడితే ఎట్లా అని ప్రశ్నించారు. సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సంపత్ టీచర్ ఉన్న చోట తాము విధులు నిర్వహించలేమని, అతడిపై ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో ఎంఈవోను వివరణ కోరగా.. కొల్చారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల టీచర్ సంపత్‌పై తరుచూ గొడవ పడుతున్నాడని ప్రిన్సిపాల్ సహా సహచర ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారన్నారు. సోమవారం ఎలాంటి సమాచారం లేకుండా పాఠశాలను వీడి వెళ్లాడని తెలిసిందని, ఈ విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్లి, తగు చర్యలు తీసుకునేలా చూస్తానని ఎంఈవోలో తెలిపారు.

మురుగునీటి సమస్య పరిష్కరించాలి

డీఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న వెంకటేశ్వర కాలనీవాసులు

నర్సాపూర్, డిసెంబర్ 2: మురుగునీటి సమస్యను పరిష్కరించాలని నర్సాపూర్‌లోని వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సభ్యులు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్డీవో శ్రీనివాస్‌రావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. మురుగునీటి సమస్యతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. ఆర్డీవో మహిపాల్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌కు వినతి పత్రాలు అందజేశారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 2: చిన్నశంకరంపేటలో మంగళవారం రైతువేదిక భవనంలో నిర్వహించే ఆయిల్‌పాం మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంఈవో లక్ష్మీప్రవీణ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సుకు డిహెచ్ఎస్‌వో ప్రతాప్‌సింగ్, సలహాదారుడు రంగనాయకులు, ప్రాజెక్టు మేనేజర్ కృష్ణ పాల్గొంటారన్నారు. ఆయిల్‌పాం పంటల సాగుపై రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫిజియో థెరపీతో శారీరక సామర్థ్యం పెరుగుతుంది

కౌడిపల్లి, డిసెంబర్2: ఫిజియోథెరపీతో శారీరక సామర్థ్యం పెరుగుతుందని నిజాం ఇనిస్టిట్యూట్ డాక్టర్ సంతోష్ అన్నారు. సోమవారం కౌడిపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎంలకు అవగాహన కల్పించారు. గ్రామ స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తే వారు ఇంట్లోవారికి పని తీరును తెలియజేస్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బాల్‌రాజు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

పారా మెడికల్, నర్సింగ్ స్కూల్ ప్రారంభం

నర్సింగ్ కళాశాలల ప్రారంభోత్సవంలో కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆరోగ్య ఉత్సవాలను సోమవారం నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ రాజ్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్ కుమార్ పాల్గొన్నారు. వర్చువల్ పద్ధతిలో పారామెడికల్, నర్సింగ్ స్కూల్, ట్రాన్స్ జెండర్ క్లినిక్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ట్రాన్స్ జెండర్ క్లినిక్ సూపరింటెండెంట్ శివదయాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కమలాదేవి, గైనకాలజిస్ట్ హెచ్‌వోడీ శాంతకుమారి, వైస్ ప్రిన్సిపాల్ వాణి పద్మజ, వైద్యారోగ్య శాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ స్థానంలో కాగజ్‌మద్దూర్ విద్యార్థి

విజేతలను, గైడ్ టీచర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నర్సాపూర్, డిసెంబర్ 2: జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిలా స్థాయి ఇన్స్పైర్ సైన్స్ ఫెయిర్, 52వ రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శన -2024లో మండలంలోని కాగజ్‌మద్దూర్ జడ్పీహెచ్ఎస్ 9వ తరగతి విద్యార్థి మధు ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయికి అర్హత సాధించాడు. ఈ సందర్భంగా హెచ్ఎం నాజియా తబస్సుమ్ మాట్లాడుతూ రైతులు పొలాల్లో ఎదుర్కొనే జంతువుల సమస్యకు పరిష్కారం సూచించే ఈ ప్రదర్శన పరిశీలకుల అభినందనలు పొందిందన్నారు. ఇదే పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి సంతోష్ ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. సోమవారం గైడ్ టీచర్ యూసూఫ్ షరీఫ్‌ను, విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు. టీచర్లు సూర్యప్రకాశ్‌రావు, మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ చారి, కవిత, వెంకటేశ్వర్‌రావు, అప్పలనాయుడు, సురేశ్‌కుమార్, సుందరయ్య, బస్వరాజ్, నర్సింహులు పాల్గొన్నారు.

అడవులను కాపాడుకుందాం

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్‌వో విద్యాసాగర్

రామాయంపేట, డిసెంబర్ 2: అగ్ని ప్రమాదాలు జరుగకుండా అడవులను రక్షించాల్సిన అవసరం ఉందని మండల అటవీశాఖ అధికారి విద్యాసాగర్ పేర్కొన్నారు. సోమవారం అక్కన్నపేటలోని పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, గొర్రెల కాపరులకు అటవీ సంరక్షణపై అవగాహన కల్పించారు. అడవులకు వెళ్లే ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. గొర్రెల కాపరులు అడవుల్లో బీడీలు తాగుతూ అలాగే పడేస్తారని, దీంతో అగ్ని ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మజ, డీఆర్‌వో శ్రీనివాస్, లక్ష్మణ్ ఉన్నారు.

యువకుడికి గాయాలు.. స్పందించిన కలెక్టర్, ఎస్పీ

ప్రమాద స్థలంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

చిన్నశంకరంపేట, డిసెంబర్ 2: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని కొర్విపల్లి శివారులో సోమవారం జరిగింది. మెదక్ మండల మక్తభూపతిపూర్‌కు చెందిన రాజు చిన్నశంకరంపేటలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో కొర్విపల్లి శివారులోని కొనుగోలు కేంద్రం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలపాలయ్యాయి. మెదక్ వెళ్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి క్షతగాత్రుడిని గమనించి, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమయం పడుతుందని తెలుపడంతో కలెక్టర్ వెంటనే తన వాహనంలో క్షతగాత్రుడిని ఏరియా దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

సింగిల్ పేరెంట్ విద్యార్థులకు ఆర్థిక సాయం

నిజాంపేట, డిసెంబర్ 2: చల్మెడలో తండ్రి లేదా తల్లి లేని సింగిల్ పేరెంట్ విద్యార్థులు 15 మందికి ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున ఆదరణ చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ ఎ.రాజు సోమవారం చెక్కులు అందజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన విద్యార్థి వడ్డే సంతు అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో అతడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.32 వేలను బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

రేపు న్యాస్ పరీక్ష

- 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్ష
- జిల్లాలో 89 పాఠశాలల విద్యార్థులకు అవకాశం

మధుమోహన్, ఎంఈవో

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 2: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించేందుకు దేశ వ్యాప్తంగా ఈనెల 4న జాతీయ సాధన సర్వే(న్యాస్) కింద పరీక్షలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వ రంగం ఏర్పాటు చేసింది. మూడేండ్లకోసారి దేశవ్యాప్తంగా 3, 6, 9 తరగతులకు చెందిన లక్షలాది మంది విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లో కనీస పరిజ్ఞానాన్ని ఈ పరీక్షల ద్వారా పరీక్షించనున్నది. రాష్ట్రంలో 3,500 పాఠశాలల్లో ఎంపిక చేసిన విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో 89 పాఠశాలల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు తరగతుల వారీగా పరీక్ష నిర్వహించనున్నారు. న్యాస్ పరీక్ష విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని హావేళీఘనపూర్ ఎంఈవో మధుమోహన్ తెలిపారు. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడం, దానికనుగుణంగా బోధనను అభివృద్ధి చేసుకునేందుకు తగిన శిక్షణ తీసుకోవడానికి తోడ్పడుతుందన్నారు.

పెండింగ్ మెడికల్ బిల్లులు మంజూరు చేయాలి

మెదక్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): మధ్యాహ్న భోజనానికి ప్రత్యేక కమిటీ వేయాలని, పెండింగ్ జీపీఎఫ్, మెడికల్ బిల్లులు మంజూరు చేయాలని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ పేర్కొన్నారు. హావేళీఘనపూర్ మండలంలోని కూచన్‌పల్లి, సర్ధన, బూర్గుపల్లి పాఠశాలల్లో ఎస్టీయ